# ప్రజలంతా సీఎం కేసీఆర్ వెంటే..

● హ్యాట్రిక్ ముఖ్యమంత్రిగా కేసీఆర్ రికార్డు సృష్టిస్తారు ● శివ్వంపేట జడ్పీటీసీ పబ్బ మహేశ్ గుప్తా


సమావేశంలో మాట్లాడుతున్న శివ్వంపేట జడ్పీటీసీ పబ్బ మహేశ్ గుప్తా

శివ్వంపేట, అక్టోబర్ 19: తెలంగాణలో సీఎం కేసీఆర్ మరోసారి ముఖ్యమంత్రిగా గెలుపొంది హ్యాట్రిక్ ముఖ్యమంత్రిగా రికార్డులు తిరగరాయడం ఖాయమని శివ్వంపేట జడ్పీటీసీ, జిల్లా ఆర్థిక ప్రణాళిక సంఘం సభ్యులు పబ్బ మహేశ్ గుప్తా అన్నారు. శుక్రవారం ఆయన శివ్వంపేటలో విలేకరులతో మాట్లాడుతూ సీఎం కేసీఆర్ కొట్లాడి సాధించిన తెలంగాణ రాష్ట్రంలో రెండు పర్యాయాలు రాష్ట్రాన్ని పరిపాలించి ఊహకు అందని రీతిలో అద్భుత ఫలితాలు సాధించి చూపించారని కొనియాడారు. రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్, రైతుబీమా, రైతుబంధు, కల్యాణలక్ష్మి, ఆసరా పెన్షన్ వంటి ఎన్నో సంక్షేమ పథకాలు దేశంలోని ఏ రాష్ట్రం కూడా తెలంగాణ దరిదాపుల్లో కూడా లేదన్నారు. రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలకు సమన్యాయం చేస్తున్నది ఒక్క కేసీఆర్ ప్రభుత్వమేనని, ప్రజలందరూ సీఎం కేసీఆర్ వెంటే ఉన్నారని, గ్రామాల్లో ప్రతిపక్ష పార్టీల కల్లబొల్లి మాటలను ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. ప్రజా అవసరాలను దృష్టిలో ఉంచుకొని ప్రజల మేలుకోసం సీఎం కేసీఆర్ మూడోసారి గెలిస్తే అమలుచేసే మ్యానిఫెస్టో పథకాలు ఎంతో ఆకర్షణీయంగా, అన్ని వర్గాల మేలుకు ఉపయోగకరంగా ఉన్నాయని పేర్కొన్నారు. ప్రతీ కార్యకర్త సైనికుడిగా పనిచేసి నియోజకవర్గంలో బీఆర్ఎస్ విజయానికి కృషిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ పత్రాల శ్రీనివాస్‌గౌడ్, ఉపసర్పంచ్ పద్మావెంకటేశ్, వార్డు సభ్యులు కొండల్, సీనియర్ నాయకులు లక్ష్మీనర్సయ్య తదితరులు ఉన్నారు.

## ప్రకృతిని పూజించే పండుగే
# బతుకమ్మ


నర్సాపూర్ పట్టణ సమీపంలోని విష్ణు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాసూటికల్ ఎడ్యుకేషన్ అండ్ రీసర్చ్ కళాశాలలో బతుకమ్మ ఆడుతున్న విద్యార్థినులు, అధ్యాపకులు

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల్లో బతుకమ్మ పండుగ ప్రత్యేకమైనదని, పూలను పూజించే సంస్కృతి ప్రపంచంలో ఎక్కడా లేదని గురువారం విష్ణు ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫార్మాసూటికల్ ఎడ్యుకేషన్ అండ్ రీసర్చ్ కళాశాల అధ్యాపకులు పేర్కొన్నారు. పూలరూపంలో ప్రకృతిని పూజించే పండుగే బతుకమ్మ అని, తెలంగాణ ప్రాంతానికే పరిమితమైన బతుకమ్మ వేడుకలను తెలంగాణ ఏర్పడిన అనంతరం రాష్ట్రంలోనే కాకుండా ప్రపంచంలోని పలు దేశాల్లో బతుకమ్మ ఆడుతున్నారంటే ఆ ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్‌కే దక్కుతుందని కొనియాడారు. బతుకమ్మ పండుగ నిర్వహణ, పూలను జలాశయాల్లో నిమజ్జనం చేయడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. – చిలిపిచెడ్/నర్సాపూర్/కొల్చారం, అక్టోబర్ 19


కొల్చారం: వరిగుంతంలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

☛ చిలిపిచెడ్ మండలంలోని ఆయా గ్రామాల్లో బతుకమ్మ సంబురాలు ఘనంగా నిర్వహించారు. గురువారం మండలంలోని చండూర్, జగ్గంపేట, అంతారం గ్రామాల్లో మహిళలు, విద్యార్థినులు తీరొక్క పూలతో బతుకమ్మలను తయారు చేసి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. గ్రామాల్లో మహిళలందరూ కలిసి బతుకమ్మ ఆటపాటలతో ఉత్సవాలు నిర్వహించారు. అనంతరం బతుకమ్మలను గ్రామ చెరువుల్లో నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

☛ నర్సాపూర్ మున్సిపాలిటీతో పాటు మండలంలోని ఆయా గ్రామాల్లో బతుకమ్మ సంబురాలు గురువారం ఘనంగా జరిగాయి. నర్సాపూర్ మున్సిపల్ పరిధిలోని శివాలయం వద్ద మహిళలు పెద్ద సంఖ్యలో బతుకమ్మ సంబురాల్లో పాల్గొన్నారు. నర్సాపూర్ పట్టణ సమీపంలోని విష్ణు ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫార్మాసూటికల్ ఎడ్యుకేషన్ అండ్ రీసర్చ్ కళాశాలలో బతుకమ్మ సంబురాలు జరుపుకున్నారు. కళాశాల సిబ్బంది, విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రమేశ్, అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

☛ కొల్చారం మండలంలోని ఆయా గ్రామాల్లో బతుకమ్మ సంబురాలు ఘనంగా నిర్వహించారు. గురువారం వరిగుంతంలో బతుకమ్మ వేడుకలను మహిళలు ఘనంగా జరుపుకున్నారు. అనంతరం చెరువులో బతుకమ్మలను నిమజ్జనం చేశారు.


చిలిపిచెడ్: చండూర్‌లో బతుకమ్మ ఆడుతున్న మహిళలు


నర్సాపూర్ శివాలయం వద్ద బతుకమ్మ ఆడుతున్న మహిళలు


పెద్దశంకరంపేటలో వాహనాలు తనిఖీ చేస్తున్న అల్లాదుర్గం సీఐ జార్జ్

## తనిఖీల వేళ సరైన పత్రాలు చూపాలి

పెద్దశంకరంపేట, అక్టోబర్ 19: ఎన్నికల కోడ్ నేపథ్యంలో పెద్దశంకరంపేట 161వ జాతీయ రహదారిపై అల్లాదుర్గం సీఐ జార్జ్ ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ చేపట్టారు. గురువారం పెద్దశంకరంపేట మండలం కోళ్లపల్లి పాత చెక్‌పోస్ట్ వద్ద వాహనాలు తనిఖీ చేపట్టి సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ప్రయాణికుల వద్ద రూ.50 వేలకు మించి నగదు ఉండరాదని, ఒకవేళ ఎక్కువ డబ్బులు ఉంటే సంబంధిత వ్యక్తులు ఉన్నతాధికారులకు సరైన పత్రాలు చూపించి జిల్లా అధికారుల నుంచి ఆ డబ్బును పొందవచ్చని సీఐ సూచించారు.


చిలిపిచెడ్‌లోని ఓ కిరాణం షాపులో తనిఖీ చేస్తున్న ఎక్సైజ్ అధికారులు

## కిరాణ షాపులో మద్యం పట్టివేత

చిలిపిచెడ్, అక్టోబర్ 19: మండల కేంద్రమైన చిలిపిచెడ్‌లో కిరాణం, బెల్ట్ షాపులపై నర్సాపూర్ స్పెషల్ టీం ఎక్సైజ్ అధికారులు గురువారం ఆకస్మికంగా దాడులు నిర్వహించి, అక్రమంగా నిల్వ ఉంచిన మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన నేపథ్యంలో ఎక్సైజ్ పోలీసులు నిర్వహించిన ఆకస్మిక సోదాల్లో అనుమతి లేకుండా నిల్వ ఉంచిన మద్యం 4.71 లీటర్లు (రూ.5,181 వేల విలువ గల) మద్యం పట్టుకున్నట్లు నర్సాపూర్ ఎక్సైజ్ ఎస్సై రాఘవేందర్ రావు తెలిపారు. అక్రమంగా మద్యం నిల్వ ఉంచిన బాలదుర్గయ్యపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. తనిఖీల్లో ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.


టేకు దుంగలను చూపుతున్న అటవీశాఖ అధికారులు

## టేకు దుంగలు పట్టివేత

పెద్దశంకరంపేట, అక్టోబర్19: పాపన్నపేట మండలంలోని అబులాపురంలో యాకలి నర్సయ్య పొలంలో రూ.20 వేల విలువ చేసే టేకు దుంగలు గురువారం సాయంత్రం పట్టుకున్నట్లు డిప్యూటీ రేంజ్ అధికారి శ్రీనివాస్ నాయక్ తెలిపారు. చాకలి నర్సయ్య తన పొలం వద్ద పర్మిషన్ లేకుండా తన ఇంటికి తరలిస్తున్న క్రమంలో గ్రామస్తులు సమాచారం అందించడంతో అటవీశాఖ సిబ్బంది స్పందించి 20 టేకు దుంగలను స్వాధీనం చేసుకొని పెద్దశంకరంపేట ఫారెస్ట్ రేంజ్ కార్యాలయానికి తరలించినట్లు ఆయన వివరించారు. కార్యక్రమంలో బీట్ అధికారులు ప్రవీణ్, రమేశ్, అజీజ్ తదితరులు పాల్గొన్నారు